క్లుప్తంగా

కిడ్నీ వ్యాధిగ్రస్తునికి రూ.10వేలు ఆర్థిక సాయం

పెదప్రోలు(మోపిదేవి): మండలంలో పెదప్రోలు పంచాయతీ పరిధిలోని ప్రశాంతి నగర్‌కు చెందిన కిడ్నీ వ్యాధి బాధితుడు కాకర్ల మూడి రాజేష్‌కు మోపిదేవికి చెందిన వ్యాపార మిత్రబృందం ఆధ్వర్యంలో శనివారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గరికిపాటి బుల్లిబాబు, నందిగం ఆంజనేయ ప్రసాద్, రుద్రపాటి కోటేశ్వరావు, మాతంగి ప్రసాద్, పాండ్రక రవితేజ ఉన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందని సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ తెలిపారు. మండ సీతారామయ్య చారిటబుల్ ట్రస్టు(మర్రిపాలెం)సౌజన్యంతో నాగాయలంకలోని మారుతీ డిజిటల్ స్కూల్ ఆవరణలో ఉదయం 9 గంటలనుంచి ఒంటి గంట వరకు ఈ శిబిరం నిర్వహిస్తామన్నారు.

నేడు దివంగత సీఎం రోశయ్య విగ్రహావిష్కరణ

అవనిగడ్డ: దివంగత ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని విగ్రహ కమిటీ కన్వీనర్ ఘంటసాల కన్నయ్య తెలిపారు. స్థానిక ఫైర్ స్టేషన్ పక్కన ఏర్పాటు చేసిన రోశయ్య విగ్రహాన్ని జగ్గయ్యపేట శాసనసభ్యుడు శ్రీరాం తాతయ్య, స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పారేపల్లి రాజేష్ ఆవిష్కరిస్తారని చెప్పారు.

ఆర్బీకేల్లో సబ్సిడీపై వరి విత్తనాలు

పెడన: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో బీపీటీ-5204, ఎంటీయూ-1224 రకాల వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని పెడన ఏవో జీవీ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 90 క్వింటాళ్లు బీపీటీ -5204, 60 క్వింటాళ్లు ఎంటీయూ -1224 వచ్చాయన్నారు. 25 కేజీల బ్యాగులు వచ్చాయని ఒక్కో రైతుకు 2.5 ఎకరాల వరకు విత్తనాలను అందిస్తామని తెలిపారు. 25 కేజీల బీపీటీ అసలు ధర రూ.1045 కాగా సబ్సిడీ రూ.125 అని, సబ్సిడీ పోను రూ.920కు 25కేజీల బ్యాగు బీపీటీ వరి విత్తనాలను రైతుకు ఇస్తామని వివరించారు. ఎంటీయూ -1224 వరి విత్తనాలు 30 కేజీల బ్యాగు ధర రూ.1254 ఉందని, సబ్సిడీ రూ.150 పోను రూ.1104కు రైతుకు ఇస్తామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు.

విద్యార్థినికి మూడు జతల యూనిఫాం అందజేత



పెడన: మానవాళి ప్రాణ, మాన రక్షణకు వస్త్రాలను అందించిన వస్త్ర ప్రదాత శ్రీదేవల మహర్షి జయంతిని పురస్కరించుకుని పెడన శ్రీబళ్ల నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న నిరుపేద విద్యార్థినికి మూడు జతల యూనిఫాంను కళాశాల ప్రిన్సిపాల్ కేసీఎస్‌వీ రామారావు అందజేశారు. శనివారం కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల లైబ్రరీ సైన్స్ అధ్యాపకుడు పేరిశెట్టి నాగరవి ఆర్థిక సాయంతో వీటిని అందించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు నిరంజన్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ



మచిలీపట్నంటౌన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఐదు రోడ్ల సెంటరులో పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. అవోపా ఆధ్వర్యంలో గత 69 రోజులుగా నిర్వహిస్తున్న మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం 16వ డివిజన్‌లోని పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఎంవీ బాబాప్రసాద్, డివిజన్ కార్పొరేటర్ దింటకుర్తి సుధాకర్, ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కొత్తగుండు రమేష్ పాల్గొన్నారు.

ఆదర్శ రైతుకు సత్కారం

ఘంటసాల: కష్టనష్టాలకు ఓర్చి వ్యవసాయం చేసి దేశానికి ఆహారాన్ని అందిస్తున్న రైతులను సన్మానించడం అభినందనీయమని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ అన్నారు. ఘంటసాలలోని గొర్రెపాటి వెంకట్రాయులు - ఉదయభాస్కరమ్మ విద్యా ట్రస్టు ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గొర్రెపాటి వెంకట్రాయులు సహచరుడైన ఆదర్శ రైతు, పాలకేంద్రం మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి వెంకట నరసింహారావు (చంటిబాబు)ను ట్రస్టు ప్రతినిధులు దుశ్శాలువాతో సత్కరించి మెమెంటోను అందించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు కొండపల్లి రామకృష్ణ, బలే జనార్దనరావు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- నగరంలో పలుచోట్ల మురుగు కాల్వల్లో తాగునీటి పైప్‌లైన్లు
- డ్రెయిన్ల సమీపంలో ఉన్న మంచినీటి పైప్‌లైన్‌లకు లీకులు
- కలుషిత నీరు, ఆహారం ద్వారా ప్రబలే డయేరియా వ్యాధి
- తక్షణ చర్యలు చేపట్టని పక్షంలో ముంచుకురానున్న ముప్పు



నగరంలోని 39వ డివిజన్‌లో మురుగునీటిలో ఉన్న తాగునీటి పైప్‌లైన్లు

మచిలీపట్నంటౌన్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇటీవల కాలంలో డయేరియా విజృంభిస్తోంది. నగరపాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే నగరంపై కూడా డయేరియా పంజా విసిరే ప్రమాదం ఉంది. నగర పాలక సంస్థ పరిధిలో పలుచోట్ల మంచి నీటి పైపు లైన్లు మురుగుకాల్వల్లో ఉంటున్నాయి. మంచినీటి పైపులకు పలుచోట్ల లీకేజీలు ఉంటున్నాయి. ఈ లీకేజీల ద్వారా మురుగునీరు మంచినీటిలో కలిస్తే అవి తాగిన నగర ప్రజలు పెద్ద సంఖ్యలో డయేరియా బారిన పడే ప్రమాదం ఉంది. కలుషిత తాగునీటిని తాగటం ద్వారా, నిల్వ ఉంచిన మాంసాహారం, ఇతర తినుబండారాలను తినడం ద్వారా కూడా డయేరియా సోకవచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయమై నగర పాలక సంస్థ అధికారులు తక్షణం నగర ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వేడి పదార్థాలను మాత్రమే తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. ఇప్పటివరకు నగరంలో ఎటువంటి డయేరియా కేసులు నమోదు కాలేదు. ఇకపై కూడా డయేరియా ప్రబలకుండా ఉండేందుకు నగర ప్రజలు అప్రమత్తంగా ఉంటూ కలుషితం కాని ఆహారం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

కలెక్టర్ కార్యాలయం ముందున్న పైప్‌లైన్‌కే లీకులు

నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి పైపులకు లీకులు ఏర్పడుతున్నాయి. ఈ లీకుల్లోంచి సమీపంలో ఉన్న డ్రెయిన్లలోని నీరు కలిస్తే ఆ నీటిని తాగిన వారికి అనారోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. నగరంలోని పలు కాలనీల్లో డ్రెయిన్లలో నీరు రోడ్లపైకి వచ్చి నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు వృద్ధి చెందటంతో కూడా ఆయా ప్రాంతాల్లో జీవించే ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. తాగునీటి పైప్‌లైన్ల లీకులకు మరమ్మతులు, కాలనీల్లో ఉన్న అపరిశుభ్ర పరిస్థితులను నివారించేందుకు నగర పాలక సంస్థ తక్షణం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రధాన ద్వారం ముందున్న పైప్‌లైన్ తరచూ లీకులు పడి నీరు వృథా అవుతోంది. ఈ నీటిలో పక్కనే ఉన్న డ్రెయిన్‌లోని నీరు చేరుతోంది. ఇక్కడి లీకుల నివారణకు తక్షణం చర్యలు తీసుకోవాలి.

శుద్ధి చేసిన రక్షిత తాగునీటిని అందిస్తున్నాం



నగర ప్రజలకు క్లోరినేషన్ చేసిన రక్షిత తాగునీటిని సరఫరా చేస్తున్నాం. నీటిని సరఫరా చేసిన అనంతరం ఆయా డివిజన్లలో ఇమ్యూనిటీ సెక్రటరీలు క్లోరినేషన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. నగరంలో పైప్‌లైన్ల లీకుల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నాం. డ్రెయిన్లలో ఉన్న తాగునీటి పైప్‌లైన్లను సక్రమంగా ఏర్పాటు చేసుకునేందుకు సదరు ఇంటి యజమానులు చర్యలు చేపట్టాలి. వేడి ఆహార పదార్థాలను కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ తరచూ చేతులు శుభ్రపరుచుకోవాలి. నగరంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీలు విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలి.

– బాపిరాజు, మునిసిపల్ కమిషనర్

భక్తి శ్రద్ధలతో బ్రహ్మోత్సవ పూజలు



రామలింగేశ్వరస్వామి ఆలయంలో లలితా సహస్ర పారాయణ చేస్తున్న సువాసినిలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో ఉన్న శ్రీరంగనాయకస్వామి, శ్రీ రామలింగేశ్వర స్వామి వార్ల వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయాల్లో పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రంగనాయకస్వామి ఆలయంలో ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీ పుష్పయాగోత్సవం (పవళింపుసేవ) కార్యక్రమాన్ని ఆలయ ఉప ప్రధాన అర్చకుడు ముత్తేవి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ఈవో కందుల వేణుగోపాలరావు పర్యవేక్షించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి అవ్వభదస్నానం, వసంతోత్సవం నిర్వహించారు. సాయంత్రం పూర్ణాహుతి కార్యక్రమాన్ని భూపతి వెంకటేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. నందివాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. మద్దినేని వెంకటనాగ జగదీష్, మామిడి మురళీకృష్ణ దంపతులు పాల్గొన్నారు. రాత్రికి ధ్వజ అవరోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు ఆలయాల్లోనూ సువాసినిలు శ్రీ లలితా సహస్ర నామ పారాయణం చేశారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ఈవో బి.సుబ్బారెడ్డి పర్యవేక్షించారు. జగన్నాధపురంలో ఉన్న శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ జగన్నాధస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామివార్ల దివ్య తిరుకల్యాణం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శనివారం ఆలయంలో పూర్ణాహుతి, చక్రస్నానం, గ్రామోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ధ్వజావరోహణం, ద్వాదశ నివేదనలు, పుష్పోత్సవం, ఆశీర్వచనం నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ గోవాడ వెంకట కృష్ణారావు పర్యవేక్షించారు.

ఫర్నిచర్ గల్లంతుపై ఈవోపీఆర్డీ విచారణ



నాగాయితిప్ప సచివాలయంలో విచారణ చేస్తున్న ఈవోపీఆర్డీ అశోక్

నాగాయితిప్ప(మోపిదేవి): గ్రామ సచివాలయంలో రెండు రోజుల క్రితం గల్లంతైన ఫర్నిచర్‌పై ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ అశోక్ శనివారం విచారణ చేపట్టారు. అశోక్ తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని నాగాయితిప్ప గ్రామ సచివాలయంలో రెండు రోజుల క్రితం రెండు పాత ఇనుప బీరువాలు, పారిశుద్ధ్య కార్మికుల రిక్షా గల్లంతయినట్లు గ్రామ సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు డీపీవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. డీపీవో ఆదేశాల మేరకు గ్రామ సచివాలయంలో సర్పంచ్ సమక్షంలో శనివారం విచారణ చేపట్టారు. పంచాయతీ బోర్డు అనుమతి లేకుండా రెండు బీరువాలు, రిక్షా బయటకు వెళ్లడంపై గ్రేడ్-5 గ్రామ కార్యదర్శి కేఎస్‌వీ రమణను వివరణకోరగా అవి తుప్పుపట్టి పాడవుతుండగా వాటి మరమ్మతులకు చల్లపల్లి తరలించినట్లు చెప్పారు. అయినా పంచాయతీ సర్పంచ్, బోర్డు అనుమతి లేకుండా బయటకు తరలించడాన్ని తప్పు పడుతూ ఆయన ఇచ్చిన రిపోర్టును ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు ఈవోపీఆర్డీ అశోక్ తెలిపారు.

దేవుడి భూములు అన్యాక్రాంతంపై ఫిర్యాదు

భూముల కౌలుదారుడే కారకుడని ధర్మకర్త ఆరోపణ



సరిహద్దులో తాటిచెట్లు అవతలి వైపు ఉన్న దేవస్థానం పొలం

నాగాయలంక: మండలంలోని నంగేగడ్డ రెవెన్యూ పరిధిలో శ్రీనరేంద్రస్వామివారి ఆలయ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని దేవస్థానం ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ మల్లాప్రగడ హరేరామ కృష్ణప్రసాద్, గ్రామ మాజీ సర్పంచ్ బావిరెడ్డి వెంకటేశ్వరరావు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దార్ ముప్పిరిశెట్టి హరనాథ్‌కు ఫిర్యాదు పత్రాలు అందజేశారు. దేవస్థానం మాగాణి పొలం సర్వే నంబరు 456లో ఎ.5.18 సెంట్లు మూడేళ్ల కౌలుకు సాగు చేస్తున్న కౌలు రైతే దక్షిణం వైపు సరిహద్దు గట్టు తొలగించి అటు పక్కనున్న తన కుటుంబ సభ్యుల పొలంలో కలిపేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దేవస్థానం మనిషి ద్వారా దేవుడి పొలం దక్షిణ వైపు గట్లు తొలగించినట్లు రూఢి చేసుకుని ఫిర్యాదు చేస్తున్నామని వివరించారు. తక్షణం చట్టపరమైన చర్యలు తీసుకుని దేవస్థానం భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని తహసీల్దార్‌ను అభ్యర్థించారు.

రేపు అయ్యప్పస్వామి ఆలయ 10వ వార్షికోత్సవం

బంటుమిల్లి: స్థానికంగా కొలువై ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ దశమ వార్షికోత్సవం ఈ నెల 24వ తేదీ సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఇందులో భాగంగా ఉదయం గణపతి పూజ అనంతరం ప్రధానమూర్తికి శ్రీసూక్త, మన్యుసూక్త, పురుషసూక్త, దుర్గాసూక్తములతో పంచామృతాభిషేకాలు, రుద్ర గాయత్రి హోమం పండితులు డి.సుధీర్‌శర్మ వేద మంత్రాల మధ్య వైభవంగా నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు ఉత్సవ మూర్తితో గ్రామోత్సవం మేళతాళాలతో ఘనంగా జరుపుతారని, భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

చిట్టిబాబు మృతి టీడీపీకి తీరని లోటు

- ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్
- నీలిపూడిలో విషాద ఛాయలు



చిట్టిబాబు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న కాగిత కృష్ణప్రసాద్

కృత్తివెన్ను: తెలుగుదేశం పార్టీ మండల నాయకుడు పుప్పాల చిట్టిబాబు (58) అకాల మరణం పార్టీతో పాటు తనకు వ్యక్తిగతంగా తీరని లోటని పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని నీలిపూడికి చెందిన చిట్టిబాబు శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆయన గ్రామ ఉపసర్పంచ్‌గా, నీటిసంఘం అధ్యక్షుడిగా, టీడీపీ గ్రామ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన మరణ వార్త తెలియగానే ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ నీలిపూడికి చేరుకుని ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిట్టిబాబు మరణం చాలా బాధాకరమన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు దేవుడు మనోధైర్యం ఇవ్వాలని కోరుకుంటూ వారిని ఓదార్చారు. అనంతరం జరిగిన అంత్యక్రియల్లో ఎమ్మెల్యేతో పాటు పెద్ద సంఖ్యలో అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావు మృతికి ఘన నివాళి



పెడన: శ్రీపైడమ్మ అమ్మవారి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ తోట నాగేశ్వరరావు భౌతిక కాయానికి రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు ఘనంగా నివాళులర్పించారు. తోట నాగేశ్వరరావు శుక్రవారం అనారోగ్యంతో మరణించిన విషయం పాఠకులకు విదితమే. శనివారం కాపుల వీధిలోని నాగేశ్వరరావు నివాసం వద్ద ఆయన భౌతికకాయానికి వేణుగోపాలరావు పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయనతో పాటు పట్టణ టీడీపీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, నాయకులు చందన నారాయణరావు, వేలికట్ల ప్రసాద్, యర్రపోతు నాగేశ్వరరావు, దాసరి నాగు, కొల్లూరి రాధాకృష్ణ తదితరులున్నారు. కుటుంబసభ్యులు శనివారం అంత్యక్రియలను నిర్వహించారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి ప్రధాన గుడి సెంటర్‌లో భక్తులకు శనివారం చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. చల్లపల్లి ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, మోపిదేవి ప్రెస్‌క్లబ్ అధ్వర్యంలో అవనిగడ్డ ప్రెస్‌క్లబ్ మిత్రుల సహకారంతో అధ్యక్షుడు అప్పికట్ల శ్రీనివాసరావు, కార్యదర్శి గడ్డిపాటి సుధీర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కనులపండువగా వెంకన్న శాంతి కల్యాణం

ఆకట్టుకున్న భక్తమండళ్ల కోలాట భజనలు



మురళీకోలాటం నిర్వహిస్తున్న భక్తమండళ్లకు చెందిన మహిళలు



స్వామివార్ల కల్యాణం నిర్వహిస్తున్న ఉభయదాతలు

కోడూరు: కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివార్ల శాంతి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ఉదయం ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. అనంతరం స్వామివార్లను ఆలయం చుట్టూ ఊరేగించారు. ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణవేదికపై శాంతి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. కోడూరుకు చెందిన వ్యాపారవేత్త మస్తాన్ దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. పండితుడు మొవ్వ రఘుశేఖరప్రసాద్ వ్యాఖ్యాతగా వ్యవహరించి, కల్యాణంలోని విశేషాలను వివరించారు. రాత్రికి ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆలయం వద్ద మహా అన్న సమారాధన నిర్వహించనున్నట్లు పద్మావతి వరప్రసాద్ చెప్పారు.

మురళీ కోలాటంతో ఆకట్టుకున్న భక్త మండళ్లు

కోడూరుకు చెందిన శ్రీవెంకటేశ్వర, శ్రీనివాస భక్త మండళ్లకు చెందిన మహిళలు నిర్వహించిన కోలాట భజనలు ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణంలో మురళీ కోలాటం చేశారు. కోలాట భజనలకు అనుగుణంగా నృత్యాలు చేసి సందడి చేశారు. యర్రారెడ్డివారిపాలెం, ఇస్మాయిల్‌బేగ్ పేటకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జరుగువానిపాలెంకు చెందిన భక్తులు అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు.

విత్తన శుద్ధి ద్వారా అధిక దిగుబడి



విత్తన శుద్ధి చేస్తున్న కూలీలు

కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత

ఘంటసాల: పంట ఏదైనా విత్తనాన్ని శుద్ధి చేసి విత్తుకోవడం వలన నాటిన తరువాత 25-30 రోజుల వరకు పురుగులు లేక విత్తనాల ద్వారా, భూమి ద్వారా వచ్చే తెగుళ్ల నుంచి పంటలకు రక్షణ లభిస్తుందని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత అన్నారు. ప్రస్తుతం చాలా వరకు విత్తనాలను శుద్ధి చేసి విక్రయిస్తున్నారని, ఒకవేళ విత్తనం శుద్ధి చేసినదైనా రైతులందరూ జాగ్రత్త వహించి విధిగా మళ్లీ విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. రెండవసారి శుద్ధి చేయడం వలన పంటకు ఎటువంటి నష్టం కలుగకుండా మొలకశాతం పెరిగి మంచి దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ, కంది, మినుము, పెసర, శనగ, వేరశనగ, ప్రొద్దుతిరుగుడు, ప్రత్తి, మిరప, ఉల్లి పంటలకు సంబంధించి విత్తనశుద్ధి పద్ధతుల గురించి, వాటికి ఉపయోగించాల్సిన రసాయనాల గురించి స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించి పాటించాలని సూచించారు.

అంగన్‌వాడీల్లో నాణ్యమైన విద్య

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరీ



పాపవినాశనం(ఘంటసాల): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.మేరీ తెలిపారు. ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్య పూర్తి చేసుకున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మేరీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ద్వారా చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంపటి అనిత, ఎంపీపీ స్కూల్ హెచ్ఎం కేఎస్‌వీఎన్ లక్ష్మి, జీఎంఎస్‌కే జి.అంకాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 53 మందికి ఉద్యోగాలు



ఎంపికైన అభ్యర్థికి నియామకపత్రాన్ని అందజేస్తున్న జిల్లా ఉపాధి కల్పన అధికారి విక్టర్‌బాబు

మచిలీపట్నంటౌన్: కృష్ణాజిల్లా ఉపాధి కల్పన శాఖ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక నోబుల్ కళాశాల ఎదురుగా ఉన్న ఉపాధి కార్యాలయంలో మినీ జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు 150 మంది నిరుద్యోగులు హాజరుకాగా వారిలో 53 మందికి డీ-మార్ట్, రిలయన్స్, ఫెడరల్, స్కిల్ అకాడమీ, ఫ్లిప్‌కార్ట్, జ్యోతి ఫెసిలిటీ సెంటర్, కాసా మోటార్స్ తదితర కంపెనీలు ఉద్యోగావకాశాలు కల్పించాయి. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ఉపాధి కల్పనాధికారి దేవరపల్లి విక్టర్‌బాబు నియామక పత్రాలను అందజేశారు. విక్టర్‌బాబు మాట్లాడుతూ నిరుద్యోగులు నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు, ఉపాధి కల్పన కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమిత్ మృతికి వైఎస్సార్ సీపీ నేతల ఘన నివాళి

ఘంటసాల: ఘంటసాల పెద్దగూడెంకు చెందిన వైఎస్సార్‌సీపీ యువ కార్యకర్త మట్టా సమిత్ కుమార్ (నాని) ఆకస్మికంగా మరణించగా శనివారం కుటుంబ సభ్యులు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమిత్ కుమార్ స్నేహితుల ఆధ్వర్యంలో ఘంటసాల గోటకం నుంచి ప్రధాన సెంటర్ మీదగా పెద్దగూడెం వరకు జోహార్ నాని అంటూ నినాదాలు చేస్తూ డప్పు వాయిద్యాల మధ్య భారీ ఊరేగింపుతో ఫ్లెక్సీలు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ముందుగా సమిత్ కుమార్ ఇంటి వద్ద జరిగిన వర్ధంతి కార్యక్రమంలో సేవాదళ్ మండల అధ్యక్షుడు దిరిశం పిచ్చేశ్వరరావు, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, స్నేహితులు సమిత్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి దంపతులకు గాయాలు

మల్లాయి చిట్టూరు(ఘంటసాల): బంధువుల ఇంటికి వెళ్తున్న దంపతులు ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోవడంతో ఇరువురు వ్యక్తులు గాయాలపాలైన సంఘటన శనివారం జరిగింది. స్థానికులు అందించిన వివరాల మేరకు విజయవాడకు చెందిన నిట్టా నాగేశ్వరరావు, శ్యామల దంపతులు ఘంటసాల మండలం పూషడం గ్రామానికి చెందిన తోడల్లుడి ఇంట్లో ఫంక్షన్‌కు వస్తున్నారు. మార్గమధ్యంలో మల్లాయి చిట్టూరు గ్రామంలోని చెరువు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో వాహనంపై ఉన్న భార్యభర్తలిద్దరూ కింద పడిపోయి గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని వారిద్దరిని తమ వాహనాలపై పూషడం గ్రామంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించి, అనంతరం వారి బంధువుల ఇంట్లో దించివెళ్లారు. తమకు చికిత్స చేయించి సాయం చేసిన గ్రామస్తులకు ఆ దంపతులిరువురూ కృతజ్ఞతలు తెలిపారు.